క్లుప్తంగా

'అంబేడ్కర్ అభయహస్తం' అమలు చేయాలి

చెన్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్ ఆరోపించారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితబంధుకు బదులుగా అంబేడ్కర్ అభయహస్తం ద్వారా లబ్ధిదారులకు రూ.12లక్షలు ఇస్తామని చెప్పి ఏడాది కావస్తున్నా, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ పథకాలను పూర్తిగా రద్దు చేశారని తెలిపారు. దళితుల అభ్యున్నతి కోసం కృషి చేస్తామని చెప్పినా ప్రభుత్వం దళితులకు అన్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కేవీపీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. కేవీపీఎస్ చెన్నూర్ మండల కన్వీనర్‌గా కనుకుంట్ల వెంకటరాజం, కో కన్వీనర్‌గా దాసరి చందులను నియమించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు జిమిడి కుమార్, దుర్గం తిరుమలరాజు, సమ్మయ్య, రాజేశ్, నూకల సతీశ్ పాల్గొన్నారు.

22న వైద్య శిబిరం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామ పంచాయతీ ఆవరణలో 22న ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్, థైరాయిడ్, కీళ్ల నొప్పులు, ఊపిరితిత్తులు, దగ్గు, దమ్ము, శ్వాసకోస వ్యాధులు, ఇతర జనరల్ వ్యాధులతో పాటు చిన్నారులు, మహిళల వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య పరీక్షలు జరిపి అవసరమైన వారికి ఉచిత మందులు కూడా ఇవ్వనున్నట్లు దొనబండ, పరిసర గ్రామ ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సమ్మెకు పీఆర్టీయూ సంఘీభావం

మంచిర్యాలఅగ్రికల్చర్: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మెకు మద్దతుగా మంగళవారం పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొట్టె శంకర్, రాసపల్లి రవి మాట్లాడారు. కొన్ని రోజులుగా న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నారని ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మహిళా అధ్యక్షురాలు బండ శాంకరి, తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కోటేశ్వర్

లక్సెట్టిపేట: ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డీసీహెచ్ఎస్ కోటేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సమయం సమీపిస్తున్నందునా నిర్మాణ పనులను నాణ్యతగా, త్వరగా చేపట్టాలన్నారు. గడువులోపు పూర్తి జేసి అప్పజెప్పాలని సూచించారు. ఆసుపత్రి ఆవరణ, గదులు ఇతర ప్రదేశాలను పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

సౌకర్యాలు కల్పించాలి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో హరికృష్ణ

తాండూర్: జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అన్నారు. మండలంలోని రేపల్లెవాడ సమీపంలోని జిన్నింగ్ మిల్లులో మంగళవారం పత్తి కొనుగోళ్ల తీరుతెన్నెలను ఆయన పరిశీలించారు. పత్తి అమ్మేందుకు వచ్చిన రైతులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, స్థానిక అధికారులు, రైతులు ఉన్నారు.

'సమస్యల పరిష్కారంలో విఫలం'

చెన్నూర్: కార్మిక సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్ అన్నారు. స్థానిక తాపీమేస్త్రీ సంఘ భవనంలో మండల సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం సీఐటీయూ చెన్నూర్ మండల కన్వీనర్‌గా శారదను ఎన్నుకున్నారు.

'గుర్తింపు' యూనియన్‌పై ఆశలు

- ఏఐటీయూసీకి వినతుల వెల్లువ
- వైద్యం, విద్యా వ్యవస్థలపై దృష్టి సారించాలంటున్న కార్మికవర్గాలు
- రిటైర్డ్ కార్మికులకు ప్రత్యేక సెల్ ఏర్పాటుకు డిమాండ్



స్ట్రక్చర్ సమావేశంలో గుర్తింపు సంఘం నాయకులు, అధికారులు(ఫైల్)

రామకృష్ణాపూర్: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీకి కార్మిక వర్గాల నుంచి వినతులు వెల్లువలా వస్తున్నాయి. గత కొంతకాలంగా తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోని కారణంగా కార్మికవర్గాల ఉనికికే ఒకింత ముప్పువాటిల్లుతుందనే ఆందోళన నెలకొందని అంటున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటున్న తరుణంలో మరికొన్ని అభిప్రాయాలు సైతం వ్యక్తం అవుతున్నాయి. ఏరియాల వారీగా గ్రీవెన్స్ విభాగం, పదవీ విరమణ పొందిన కార్మికుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తే బాగుంటుందనే సూచనలు వినిపిస్తున్నాయి. ఇన్నాళ్లు నిర్లక్ష్యానికి గురైన తమపై యూనియన్ నాయకులు ప్రత్యేక దృష్టిసారించాలనే డిమాండ్ల నేపథ్యంలో ప్రత్యేక కథనం.

సత్సంబంధాలకు ఆస్కారం..

సింగరేణి వ్యాప్తంగా గుర్తింపు కార్మిక సంఘంగా గెలిచిన ఏఐటీయూసీపై కార్మికులు ఆశలెన్నో పెట్టుకున్నారు. ముఖ్యంగా ఏరియాల వారీగా గ్రీవెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ ప్రధానంగా వినిపిస్తోంది. కాలనీల్లోని సమస్యలతో పాటు గనులు, డిపార్ట్‌మెంట్లలోనూ సంక్షేమ చర్యలు చేపట్టాలనేది కార్మికుల వాదన. ఈ క్రమంలోనే ప్రతీ వారం గ్రీవెన్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. తద్వారా యూనియన్ నాయకులే కాకుండా సంస్థ అధికారుల మధ్య సత్సంబంధాలు ఏర్పడటమే కాకుండా సమస్యలు సైతం పరిష్కారానికి నోచుకునే అవకాశం ఉంటుదని చెబుతున్నారు.

రిటైర్డ్ కార్మికులను పట్టించుకోవాలి...

ప్రస్తుతం సంస్థలో పనిచేస్తున్న వారే కాకుండా పదవీ విరమణ పొందిన కార్మికుల సమస్యలపై కూడా గుర్తింపు సంఘం దృష్టిపెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. సంస్థకు దశాబ్దాల పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన కార్మికుల కోసం ప్రత్యేకంగా ఒక సెల్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఫలితంగా ఏరియాల వారీగా మాజీ కార్మికులు తమతమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఓ మార్గం దొరుకుతుందని ఆశిస్తున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడ్డ సింగరేణి మాజీ కార్మికులు వారి సమస్యల పరిష్కారం కోసం ఆయా ఏరియాలకు వస్తే నివసించేందుకు వీలుగా వసతి కూడా కల్పించేందుకు కృషి చేస్తే బాగుంటుందని అంటున్నారు. ఆయా సమస్యలు, సూచనల నేపథ్యంలో గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ వీటిపై ఎలా స్పందిస్తుందో అన్నది ఆసక్తిగా మారింది. గుర్తింపు సంఘానికి, యాజమాన్యానికి మధ్య జరిగే స్ట్రక్చర్ సమావేశాల్లో కార్మికుల సమస్యలు లేవనెత్తి, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరుతున్నారు.

విద్యా, వైద్యంపై దృష్టిపెట్టాలి

తమ సమస్యలు, సంక్షేమమే కాకుండా సింగరేణి వ్యాప్తంగా విద్యా, వైద్యరంగాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కార్మికవర్గం డిమాండ్ చేస్తుంది. ప్రస్తుతం సంస్థ ఆధీనంలో ఉన్న ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సదుపాయాలు, వసతులు లేవు. దీంతో మెరుగైన వైద్య సేవలకోసం కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుంది. సామాన్య కార్మిక కుటుంబాలకు ఇది వ్యయప్రయాసాలతో కూడుకున్నది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఏరియా ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యులు లేరు. తక్షణమే స్పెషలిస్ట్ వైద్యులను భర్తీ చేసి ఏరియా ఆసుపత్రుల్లోనే మెరుగైన చికిత్స అందేలా చూడాలని కోరుతున్నారు. దీంతో పాటు సింగరేణి విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందనే వేదన నెలకొంది. గతంలో వేలాదిమంది విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దిన సింగరేణి పాఠశాలలు ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారగా కొన్ని ఏరియాల్లో సంస్థ పాఠశాలలు కూడా పడ్డాయి. ఈ అంశంపై కార్మికవర్గం ఆందోళనకు గురవుతోంది. ప్రతీ కార్మికుడికి, వారి కుటుంబసభ్యులకు విద్యా, వైద్యం ఈ రెండు అంశాలే చాలా కీలకంగా మారాయి. కనుకనే విద్యా, వైద్య రంగాలను మెరుగుపర్చాలనే డిమాండ్ ప్రధానంగా వినిపిస్తోంది. చివరికి విద్యను కొనుక్కునే దుస్థితి తమకు పట్టిందని కార్మికవర్గం వాపోతోంది.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన



చెన్నూర్: నిరసన తెలుపుతున్న నాయకులు



కన్నెపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి

చెన్నూర్/బెల్లంపల్లి/జన్నారం/నెన్నెల/కోటపల్లి/మందమర్రిరూరల్/భీమిని/కాసిపేట: లగచర్ల రైతులపై అక్రమ కేసులు నమోదు చేసి రైతుల చేతులకు బేడీలు వేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపులో భాగంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు తెలియజేశారు. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం అణిచివేత ధోరణి ప్రదర్శిస్తోందని విమర్శించారు. భూములు ఇవ్వని పాపానికి లగచర్ల రైతులపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారని పేర్కొన్నారు. రైతు రాజ్యమని చెప్పుకుంటున్న ప్రభుత్వం, చేతులకు బేడీలు వేసి అవమానించిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. చెన్నూర్‌లో అంబేడ్కర్ చౌరస్తాలో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపి అనంతరం అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. బెల్లంపల్లి, జన్నారం, నెన్నెల, కోటపల్లి, మందమర్రి, భీమిని, కాసిపేట మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఆందోళనలు నిర్వహించి, అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జన్నారం మండల కేంద్రంలో...

'గ్యారంటీల పేరుతో వంచించిన కాంగ్రెస్'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీలు ఇచ్చి వంచించిందని నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సంస్థాగత రాష్ట్ర ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి సంస్థాగత ఎన్నికల వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాంగ్రెస్ పాలనలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి బుద్ధ లింగారెడ్డి, పెద్దపల్లి పురుషోత్తం, రజనీశ్ జైన్, దుర్గం అశోక్, ముల్కల్ల మల్లారెడ్డి, కొయ్యల ఏమాజి, ఎనగందుల కృష్ణమూర్తి, అమరాజుల శ్రీదేవి, గాజుల ముఖేశ్‌గౌడ్, ముత్తె సత్తయ్య, మోటపలుకుల గురువయ్య పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్



ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవికుమార్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ వైద్యులకు సూచించారు. బెల్లంపల్లిలోని 100పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ల్యాబ్, ఫార్మసీ, రికార్డులు, రిజిష్టర్లు ఆయన నిశితంగా పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలోని పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రికి దాదాపు అట్టడుగు స్థానంలో ఉన్న ప్రజలు వైద్యం కోసం వస్తుంటారని, వారితో మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. రోగులకు అవసరమైన మందులు ఆసుపత్రిలో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అంతకుముందు బెల్లంపల్లి మండలం చెర్లపల్లిలో రూ.8, 10లక్షల అంచనాతో నిర్మిస్తున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పాఠశాల భవన నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టి, సకాలంలో పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, ఫార్మసిస్ట్ శ్రీనివాస్, వైద్యులు, నర్సులు, సిబ్బంది ఉన్నారు.

విలువలకు మారుపేరు నరసింహారెడ్డి

- జైపూర్‌లో ప్రధానోపాధ్యాయుడి పేరిట కమాన్ ఏర్పాటు



నివాళులర్పిస్తున్న ఆనాటి ఉపాధ్యాయ బృందం

జైపూర్: స్కూల్ హెచ్‌ఎంగా పత్తి నరసింహారెడ్డి విలువలతో కూడిన విద్యను నేర్పించడం ఫలితంగా నేడు ఎంతో మంది విద్యార్థులు గురువులుగా, పోలీసులుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా, రాజకీయ ప్రముఖులుగా మారారని, విద్యార్థులకు, తోటి ఉపాధ్యాయులకు ఆయన చూపించిన మార్గం ఆదర్శనీయమని ఆనాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలిపారు. జైపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా 1985నుంచి 2000సంవత్సరం వరకు పనిచేసిన పత్తి నరసింహారెడ్డి జయంతి ఉత్సవాలను పూర్వవిద్యార్థులు జైపూర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దుబ్బపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల నుంచి జైపూర్ హైస్కూల్‌కు రావడానికి రహదారి సరిగ్గాలేని క్రమంలో ఆయన అప్పటి ప్రజాప్రతినిధులతో కలిసి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి దుబ్బపల్లి గ్రామానికి శ్రమదానంతో రోడ్డు నిర్మించారు. ఆయన కృషి ఫలితంగా ఏర్పడిన రోడ్డుకు పూర్వవిద్యార్థులు దుబ్బపల్లి రోడ్డు వద్ద హెచ్‌ఎం.నరసింహారెడ్డి జ్ఞాపకార్థం కమాన్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆ కమాన్‌ను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి సతీమణి, విరామ ఉపాధ్యాయురాలు మధురాబాయి, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు కేవీఎం.ప్రకాశ్‌రావు, ఆనాటి ఉపాధ్యాయ బృందం, పూర్వవిద్యార్థులు అంతా కలిసి ప్రారంభించారు. అనంతరం స్థానిక పీఎల్ఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో వారు మాట్లాడారు. ఉద్యోగరిత్యా ఆయా ప్రాంతాల్లో స్థిరపడ్డ పూర్వవిద్యార్థులు అంతా ఒక్కచోట కలుసుకొని వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వనజారెడ్డి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

'రైతునేస్తం' వినియోగించుకోండి



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రసాద్

జన్నారం: రైతునేస్తం కార్యక్రమాన్ని మండలంలోని ప్రతీ రైతు వినియోగించుకోవాలని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు బి.ప్రసాద్ అన్నారు. మండలంలోని పొనకల్ రైతువేదికలో మంగళవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని రైతునేస్తం కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యాసంగి పంటలో సంరక్షణ చర్యలు తీసుకోవాలని, రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం రైతువేదిక సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి తప్పా, తాలు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారిని సంగీత, విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధికి ప్రణాళికలు


- ఎస్ఓటు జీఎం సత్యనారాయణ
- మల్టీ డిపార్టుమెంటల్ సమావేశాలు



మాట్లాడుతున్న ఎస్ఓటు జీఎం సత్యనారాయణ

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ అభివృద్ధి, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి తగిన ప్రణాళికలు తయారు చేసుకోవాలని మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ కన్వీనర్, ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ తెలిపారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం, సెక్యూరిటీ విభాగం, వీటీసీ, డిస్పెన్సరీ, ఏరియా వర్క్‌షాప్, ఏరియా స్టోర్స్‌లలో మంగళవారం మల్టీ డిపార్టుమెంటల్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంపెనీ ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. సంస్థ ప్రస్తుత స్థితిగతులు ప్రతి ఉద్యోగి తెలుసుకోవాలన్నారు. ఉద్యోగులు, అధికారులు సమష్టిగా పని చేసి అనుకున్న లక్ష్యాలు సాధిస్తేనే సంస్థ మనుగడ సాధిస్తుందన్నారు. వేరువేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎంలు చిరంజీవిలు, ఆనంద్ కుమార్, రామకృష్ణ, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, ఇన్‌చార్జి డీజీఎం (పర్సనల్) రాజేశ్వర్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్ రెడ్డి ఆయా గనుల పిట్ సెక్రెటరీ పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశం



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ సీహెచ్‌పీలో మంగళవారం మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు నిబద్ధతతో పనిచేస్తూ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రమాదాలు లేని సంస్థగా సింగరేణిని తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీజీఎం ఐఈడీ రాజన్న, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎం ఎఫ్అండ్‌ఏ ప్రసాద్, సీహెచ్‌పీ ఎస్ఈ చంద్రమౌళి, ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

రక్షణలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న కోటిరెడ్డి

మందమర్రిరూరల్: ప్రతీ ఉద్యోగి రక్షణలో భాగస్వాములు కావాలని రక్షణ పక్షోత్సవ కమిటీ కన్వీనర్ జీవీ కోటిరెడ్డి (ఎస్వోటు జీఎం, కొత్తగూడెం) అన్నారు. మందమర్రి ఏరియాలోని జీవీటీసీలో మంగళవారం రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా ఏరియా జీఎం దేవేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జీవీ కోటిరెడ్డి మాట్లాడారు. ఏరియాలో ప్రమాదాలు జరగకుండా ఉద్యోగులు తగిన శిక్షణ తీసుకొని, రక్షణ సూత్రాలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి సహకరించాలని పేర్కొన్నారు. ఏరియా అధికారులు, యూనియన్ ప్రతినిధులు, జీవీటీసీ ఉద్యోగులు ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

23న నిరసన తెలపాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న జరిగే సింగరేణి డే వేడుకల్లో కాంట్రాక్ట్ కార్మికులందరూ నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై మంగళవారం ఆయన కాంట్రాక్ట్ కార్మికులతో మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు, యాజమాన్యానికి మధ్య లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయడం లేదన్నారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా వేతనాలు పెంచలేదన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్: సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, మందమర్రి సీఐటీ యూ బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆర్కే 7 గనిలో, కేకే–5 గనిపై మంగళవారం కార్మికులను కలిసి వారు మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

రెస్ట్ హాల్స్ ఏర్పాటు చేయాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో కొంతకాలం విధులు నిర్వర్తించి రిటైర్మెంట్ అయిన కార్మికులు వివిధ పనులపై ఆయా ఏరియాలకు రాకపోకలు కొనసాగిస్తారని, వారి సౌకర్యం కోసం రెస్ట్‌హాల్స్ ఏర్పాటు చేయాలని హెచ్చెమ్మెస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ ఆఫీస్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు పాల్గొన్నారు.

'ఐఎన్‌టీయూసీ కార్మికుల పక్షపాతి'

కాసిపేట: ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘం ఎల్లప్పుడు కార్మికుల పక్షపాతిగా ఉంటుందని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట 2ఇంక్‌లైన్ గనిపై మంగళవారం బాయిబాట నిర్వహించారు. కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

దీపాలంకరణ పోటీలు

శ్రీరాంపూర్: ఈ నెల 23న జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నస్పూర్ కాలనీ సేవాభవన్‌లో దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులు పెట్టి దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. విజేతలకు ప్రగతి మైదానంలో జరిగే ఆవిర్భావ వేడుకల్లో బహుమతి ప్రదానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రమాద రహిత ఉత్పత్తి సాధించాలి



మాట్లాడుతున్న జీఎం బానోత్ సైదులు

శ్రీరాంపూర్: ప్రమాద రహిత ఉత్పత్తి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని రక్షణ తనిఖీ కమిటీ కన్వీనర్ జీఎం(ఎన్విరాన్మెంట్) బానోత్ సైదులు తెలిపారు. ఆర్కే న్యూటెక్ గనిపై మంగళవారం 55వ రక్షణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించి అనంతరం మాట్లాడారు. సింగరేణి ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దాలన్నారు. ఉద్యోగులు రక్షణతో పనిచేసి సంస్థ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. తొందరపాటుతో, నైపుణ్యం లేకుండా, రక్షణ సూత్రాలను విస్మరించి పనిచేస్తే ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఎస్ఓపీలకు అనుగుణంగా పని చేయాలన్నారు. యువ ఉద్యోగులు గైరాజరు ఎక్కువ చేస్తున్నారని, ఇకనైనా మాని డ్యూటీలకు రావాలన్నారు. అనంతరం రక్షణ తనిఖీ కమిటీ సభ్యులు గనిలోకి దిగి రక్షణ చర్యలు పరిశీలించారు. కళాకారులు రక్షణపై ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. ట్రేడ్‌టెస్టులో విజేతలైన ఉద్యోగులకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఏరియా రక్షణాధికారి శ్రీధర్ రావు, గ్రూప్ ఏజెంట్ రాజేందర్, గని మేనేజర్ స్వామిరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల :
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
చెన్నూర్ : సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899